

సాక్షి నిజామాబాద్

రేపటికి ముందడుగు



శుక్రవారం । 8 । మార్చి । 2024

న్యూస్‌రీల్

'అగ్నివీర్'లో అతివలు

- ఆదర్శంగా నిలుస్తున్న యువతులు

మోపాల్: తాము ఎందులోనూ తక్కువ కాదంటున్నారు ఈ యువతులు.. అగ్నివీర్‌లో చేరాలంటే యువకులే చెమటోడుస్తున్న తరుణంలో వీరు ఉద్యోగాలకు ఎంపికై ఆదర్శంగా నిలుస్తున్నారు. మోపాల్ మండలం కాల్పోల్ తండాకు చెందిన బస్సీ మౌనిక అగ్నివీర్‌లో ఉద్యోగానికి(మిలిట్రీ పోలీస్ ఉమెన్) ఎంపికయ్యారు. తండాకు చెందిన బస్సీ జమునాబాయి, హన్రాజ్ దంపతుల కూతురు. అగ్నివీర్‌కు ఎంపికైన మౌనిక ఏప్రిల్ 29 నుంచి బెంగుళూరులో శిక్షణ పొందనుంది.

స్ఫూర్తిగా నిలవాలని కోరిక



ఆర్మీ ఉద్యోగానికి ఎంపికై యువతకు స్ఫూర్తిగా నిలవాలనేది నా కోరిక. చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరాలనేది కల. నాకు నాన్న రోల్ మోడల్. ఎంతో కష్టపడి చదివించారు. సరిహద్దులో రక్షణగా ఉండి దేశానికి సేవ చేసుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా. - బస్సీ మౌనిక

అన్నాసాన్‌పల్లి యువతి



ఇందల్వాయి: ఇందల్వాయి మండలం అన్నాసాన్‌పల్లికి చెందిన ముడేటి ప్రియాంక అగ్నివీర్‌కు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన మల్లయ్య–సావిత్రి దంపతుల చిన్న కూతురు. 2023 మేలో కరీంనగర్‌లో జరిగిన అగ్నివీర్ ఎంపిక పరీక్షలో ప్రియాంక సత్తా చాటింది. ఫిబ్రవరిలో వెలువడిన ఫలితాల్లో శిక్షణకు ఎంపికై ంది. ఏప్రిల్‌లో శిక్షణ నిమిత్తం బెంగుళూరు వెళ్లనున్నట్లు ప్రియాంక తెలిపారు.

బోధన్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో రూప్‌సింగ్ సస్పెన్షన్

- కొత్త ఎస్‌హెచ్‌వోగా పవన్‌గౌడ్

బోధన్: బోధన్ డివిజన్ ఎక్సైజ్ సర్కిల్ ఎస్‌హెచ్‌వో రూప్‌సింగ్‌ను సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నుంచి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బోధన్‌లో రెండేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌హెచ్‌వోపై అనేక ఆరోపణలున్నాయి. ఇటీవల బెల్టు షాప్‌లపై చేసిన తనిఖీ ల్లో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయలేదని ఆరోపణలు రా వడంతో పాటు, కొందరు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు ఆయనపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఎస్‌హెచ్‌వోపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయమై జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ మల్లారెడ్డిని గురువారం రాత్రి సంప్రదించగా ఎస్‌హెచ్‌వో రూప్‌సింగ్‌పై వచ్చిన ఆరోపణల కారణంగా సస్పెండ్ అయినట్లు తెలిపారు. ఆయన స్థానంలో వరంగల్ జిల్లా నుంచి పవన్‌గౌడ్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారని వెల్లడించారు.

వివక్ష రూపుమాపాలి



సాక్షి టాక్‌షోలో పాల్గొన్న విద్యార్థినులు

- ఆడ, మగ భేదం వద్దు
- మహిళల్లో అపారమైన శక్తి ఉంది
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' టాక్ షోలో విద్యార్థినులు

ఆడవారిలో అపారమైన శక్తి ఉందని, సమానత్వమే తమకు ప్రోత్సాహమని విద్యార్థినులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మానిక్‌బండార్‌లోని కిట్స్ ఇంజినీరింగ్ మహిళా కళాశాలలో 'సాక్షి' దినపత్రిక గురువారం టాక్ షో నిర్వహించింది. 'ఆడ పిల్లలపై వివక్ష ఎక్కడ ఉంది..?' అంశంపై ఇంజినీరింగ్ విద్యార్థినులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఆడ, మగ వివక్షను రూపుమాపాలని గొంతెత్తారు.
– నిజామాబాద్‌అర్బన్

మరిన్ని అభిప్రాయాలు -10లో..



సోషల్ మీడియాను నియంత్రించాలి



సోషల్ మీడియాను నియంత్రించాలి. ఇందులోనూ ఆడవారిపై వివక్షచూపే అంశాలు ఎక్కువగా ఉంటున్నాయి. లైక్‌ల కోసం ఇష్టానుసారంగా వీడియోలు చేసి పోస్ట్ చేస్తున్నారు. సోషల్ మీడియాను నియంత్రించేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు రూపొందించాలి. అప్పుడే ఇబ్బందులు ఉండవు.
– సాత్విక

శిక్ష పడడం లేదు



మహిళలపై దాడులు చేసిన వారిపై, లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై చట్టపరంగా సరైన చర్యలు ఉండడం లేదు. నిందితులు మధ్యలోనే తప్పించుకుంటున్నారు. శిక్ష అమలవుతేనే మార్పునకు అవకాశం ఉంటుంది. చట్టంలో నిబంధనలు ఉండాలి. కఠినంగా వ్యవహరిస్తేనే ఫలితం ఉంటుంది.
– ఎస్.కావేరి, ఈసీఈ థర్డ్ ఇయర్

తల్లిదండ్రులే మార్పు తీసుకురావాలి





ఆడ, మగ అనే తేడా లేకుండా అందరూ సమానమనే భావన ముందుగా తల్లిదండ్రుల్లో ఉండాలి. కొడుకును ఒక విధంగా, కూతురును మరో విధంగా పెంచడం సరైంది కాదు. ఇక్కడే వివక్ష మొదలవుతోంది. చిన్ననాటి నుంచే ఆడవారిపై వివక్ష కొనసాగుతున్న పరిస్థితుల్లో ఉన్నతశిఖరాలను ఎలా అధిగమించగలరు.
– హారతి

కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి

విద్యాలయాల్లో కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి. ఆడవారితో సత్ప్రవర్తనతో మెలగాలనే అవగాహన కల్పించాలి. ఇందుకోసం కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. తద్వారా మార్పు వచ్చే అవకాశం ఉంది. పాఠశాలలు, కళాశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేయాలి.
– రితిక

రక్షణ కల్పించాలి

బయటకి వెళ్లాలంటేనే మహిళలు భయపడుతున్నారు. భయం పోవాలంటే సమాజంలో మహిళలకు సరైన రక్షణ కల్పించాలి. కొన్ని దేశాల్లో ఉన్న రక్షణ విధానాలను మనవద్ద కూడా అమలు చేయాలి. తక్షణమే సహాయం అందే పద్ధతులు అందుబాటులో ఉండాలి.
– వై.వినీల

'ఉచిత బస్సు' తేడా చూపుతుంది



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు ప్రయాణం సరైంది కాదు. ఈ నిర్ణయం ఆడ, మగ అనే తేడాను చూపుతోంది. ఉచిత బస్సు ప్రయాణం వల్ల కూడా చిన్నపిల్లలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. వివక్షను ఎత్తిచూపే సదుపాయాలు ఉండకూడదు. అందరూ సమానమే అనే విధంగా అభివృద్ధి పథకాలు ఉండాలి.
– సంజన శ్రీ

మార్ఫింగ్ ఆందోళన కలిగిస్తోంది



ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మిస్‌యూజ్ చేస్తుండడంతో ఆడవారే ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో మహిళలు, విద్యార్థినుల మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎక్కడకు వెళ్లినా ఆడవారిపైన వివక్ష కొనసాగుతోంది.
– సీహెచ్ శ్రీవర్షిణి

బహిరంగ ప్రదేశాల్లో వివక్ష



ప్రస్తుత సమాజంలో బహిరంగ ప్రదేశాల్లోనే మహిళలు, విద్యార్థినుల పట్ల వివక్ష కొనసాగుతోంది. వేధింపులు కూడా ఎక్కువే. ముఖ్యంగా బస్టాండ్, రైల్వేస్టేషన్, వ్యాపార సముదాయాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. అందరూ సమానమే అనే భావన ఉండాలి. అప్పుడే మహిళలపై దాడులు జరగవు.
– ఎల్.కావ్య



ఐఏఎస్ అధికారిణి కిరణ్మయి

గెస్ట్ ఎడిటర్‌గా..

- ఎప్పటికీ మరచిపోలేని తీపి గుర్తుగా పేర్కొన్న ఐఏఎస్ అధికారిణి కిరణ్మయి
- ఈ అవకాశంతో ఆలోచనలకు మరింత పదును పెరుగుతుందని వ్యాఖ్య
- పాత్రికేయులు ఎదుర్కొనే సవాళ్లు ఆసక్తికరమంటూ అభినందన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: 'సాక్షి' నిజామాబాద్ ఎడిషన్ కార్యాలయంలో గురువారం గెస్ట్ ఎడిటర్‌గా ఐఏఎస్ అధికారిణి డాక్టర్ కొప్పిసెట్టి కిరణ్మయి వ్యవహరించారు. డెస్క్‌కు వచ్చిన వార్తలను పరిశీలించి పేజీలకు కేటాయించారు. సబ్ ఎడిటర్లకు పలు సూచనలు ఇచ్చారు.

ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ రెప్యుటేషన్ కలిగిన పత్రికకు గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించే అవకాశం రావడం ఎప్పటికీ మరిచిపోలేని తీపి గుర్తుగా పేర్కొన్నారు.

నిరంతరం ప్రపంచాన్ని మేలుకొల్పే పత్రికా రంగం ద్వారా అందుతున్న సేవలు చాలా గొప్పవన్నారు. అత్యంత బాధ్యతాయుతమైన సేవలు అందించే చోట తనకు గెస్ట్ ఎడిటర్‌గా పనిచేసే అవకాశం వచ్చిందన్నారు. వార్తా సేకరణ మొదలు పబ్లిష్ అయ్యాక ప్రజలకు కలిగే ఉపయోగాలు, ఈ క్రమంలో పాత్రికేయులు ఎదుర్కొనే సవాళ్లు, తదుపరి పరిణామాలను చూస్తుంటే ఆసక్తిగా ఉందన్నారు. గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించడం కారణంగా సరికొత్తగా వచ్చే ఆలోచనలకు మరింత పదును పెట్టుకోవచ్చని అర్థమవుతోందన్నారు. సివిల్స్ ప్రిపరేషన్ కోసం పత్రికలు చదివానని, ఇకపై ప్రజా సమస్యల పరిష్కారం కోసం సైతం పత్రికల కథనాలను క్షుణ్ణంగా గమనిస్తానన్నారు. మెడికల్ పీజీ చేసే సమయంలో పేషంట్ల ద్వారా వివిధ రకాల అంశాలు తెలుసుకున్నానన్నారు. ప్రస్తుతం గెస్ట్ ఎడిటర్‌గా రావ డం కారణంగా వివి ధ అంశాలు తెలిశాయన్నారు. సివిల్ సర్వెంట్‌గా విద్య, వైద్య సేవలందించే విషయంలో, మహిళా సాధికారత విషయంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. దివ్యాంగుల కోసం డేకేర్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానన్నారు.

భర్త ప్రోత్సాహం.. తల్లిదండ్రుల సహకారంతో..

ఎంఎస్ జనరల్ సర్జన్‌గా పట్టభద్రురాలైన తర్వాత ఒక పాపకు జన్మనిచ్చాక సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు కిరణ్మయి. సొంత రాష్ట్రమైన తెలంగాణ కేడర్‌కు ఎంపికైన ఆమె తన భర్త విజయ్‌కుమార్ ప్రోత్సాహంతో నాలుగో ప్రయత్నంలో అనుకున్నది సాధించారు. కిరణ్మయి తండ్రి లక్ష్మణ్‌రావు, తల్లి వెంకటలక్ష్మి ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైరయ్యారు. తల్లిదండ్రులు, సోదరుడి ప్రోత్సాహంతో ఉస్మానియా మెడికల్ కళాశాల నుంచి 2010లో ఎంబీబీఎస్, 2015లో ఎంఎస్ జనరల్ సర్జన్ పూర్తి చేశారు. 2014లో వివాహం చేసుకున్నారు. భర్త విజయ్‌కుమార్ గ్రూప్–1 అధికారిగా జీఎస్టీ విభాగంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఐఏఎస్ కావాలనుకుని విఫలవడంతో కిరణ్మయిని ప్రోత్సహించారు. దీంతో ఆమె 2016లో సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించారు. తల్లిదండ్రులు, భర్త పాపను చూసుకున్నారు. మొదటి ప్రయత్నంలో ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌కు, రెండో ప్రయత్నంలో డానిక్స్(ఢిల్లీ, అండమాన్ నికోబార్ ఐలాండ్స్ సెంట్రల్ సర్వీస్‌కు) ఎంపికయ్యారు. డానిక్స్ పరిధిలో సర్వీస్‌లో చేరిన కిరణ్మయి మూడో ప్రయత్నంలో ప్రిలిమ్స్‌లోనే విఫలమయ్యారు. అయినప్పటికీ పట్టువదలకుండా ఢిల్లీలో ఉద్యోగం చేస్తూనే నాలుగో ప్రయత్నంలో 2022లో 56వ ర్యాంక్‌తో ఐఏఎస్‌గా ఎంపికై సొంత రాష్ట్ర కేడర్ దక్కించుకున్నారు.



చదువే గేమ్ చేంజర్..

చదువు అనేది ప్రతి ఒక్కరికీ గేమ్ చేంజర్ లాంటిది. చదువు విషయంలో ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలి. ఆడపిల్లలను చదువు విషయంలో ఎంత ప్రోత్సహిస్తే అంత ఎక్కువ స్థాయిలో ఫలితాలు వస్తాయి. అన్ని రంగాల్లో మహిళలు తిరుగులేని విజయాలు సాధిస్తున్నారు. ఆడపిల్లలకు ఏమాత్రం చిన్న ప్రోత్సాహమిచ్చినా ఆకాశమే హద్దుగా దూసుకెళ్తారన్నారు. సాంకేతిక, వైద్య, విద్య రంగాలతో పాటు ఇస్రో, నాసాల్లో సైతం మహిళా శాస్త్రవేత్తలే అధికంగా ఉన్నారు. న్యాయవాదులుగా, ఎగ్జిక్యూటివ్స్‌గా, బ్యూరోక్రాట్స్‌గానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా రాజకీయ రంగంలోనూ మహిళలు అందిస్తున్న సేవలు ఆదర్శనీయంగా ఉంటున్నాయి. ఆడపిల్లలను ఏమాత్రం భారంగా భావించకూడదు. – కిరణ్మయి

మహిళలకు తప్పని వేధింపులు

- ఫిర్యాదుకు అతివల వెనకడుగు
- సాక్షి సర్వేలో వెల్లడి

సమాజం మారుతున్నా.. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నా.. మహిళలపై వివక్ష, వేధింపులు ఆగడం లేదు. విద్యార్థినులు, మహిళలు నిత్యం ఏదో ఒకరకంగా వివక్ష ఎదుర్కొంటునే ఉన్నారు.. ఆడపిల్ల బయటకు వెళ్లాలంటే ఇంకా పూర్తిస్థాయిలో స్వేచ్ఛ లభించడం లేదు. మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రశ్నలతో వివిధ రంగాల్లోని 530 మంది మహిళలు, విద్యార్థులను సర్వేచేయగా వారు ఇంకా వేధింపులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కొద్దిమేర మార్పు వస్తున్నా కొన్ని రంగాల్లో మాత్రం ఇంకా వివక్ష కొనసాగుతునే ఉందని పేర్కొన్నారు. మరోవైపు ఇబ్బందులు పడుతున్నా.. ఫిర్యాదు చేసేందుకు అతివలు వెనకడుగు వేస్తున్నట్లు తేలింది. బస్టాండ్, రైల్వే స్టేషన్, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు తెలిపారు. –నిజామాబాద్ అర్బన్

సర్వేలో మహిళలు తెలిపిన అభిప్రాయాలు

ప్రశ్న: ఆడపిల్లలు బయటకు వెళ్లాలంటే పూర్తి స్వేచ్ఛ ఉందా?




ప్రశ్న: స్కూల్, కాలేజీల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయా?



ప్రశ్న: ఈవ్ టీజింగ్ ఎక్కడ ఎదురవుతోంది?



ప్రశ్న: టీజింగ్‌కు గురైతే ఎలా ముందుకు వెళ్తున్నారు?





విద్యుత్ వెలుగుల్లో నీలకంఠేశ్వరాలయం

హరహర మహాదేవ..

- శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు
- నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ సిటీ : పరమేశ్వరుడికి ప్రీతిపాత్రమైన మహాశివరాత్రి రోజు ఉపవాస దీక్ష చేపట్టి, శివనామస్మరణ చేస్తే సకల పాపాలూ హరిస్తాయని, శివలోక ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. అందుకే ఈ రోజున భక్తులు ఎంతో నిష్ఠతో స్వామివారిని కొలుస్తారు. కఠిన ఉపవాసంతో ముక్కంటిని ఆరాధిస్తారు. శుక్రవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగులీనుతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయాల వద్ద ఏర్పాట్లు చేశారు.

వ్యవసాయంలో మహిళా శక్తి

- కఠిన పరిస్థితుల్లోనూ నిబద్ధతతో సాగు చేస్తున్న నారీమణులు
- పోచమ్మతల్లిగా భావించే పసుపు సాగును పట్టుదలగా చేస్తున్న మహిళా రైతులు



కల్లంలో పసుపు పంటను నెరుపుతున్న సువర్ణ



గడ్డం లహరి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆకలిని అర్థం చేసుకుని వడ్డించేది అమ్మ. మానవాళికి అవసరమైన ఆహారం పండించేది చేసేది రైతన్న. అయితే వ్యవసాయ జిల్లాగా పేరుపొందిన నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ఆహారం వండి వడ్డించే తల్లులే అన్నదాతలుగానూ పాత్ర పోషిస్తూ తమకు తామే సాటి అని నిరూపించుకుంటున్నారు. పట్టుదలతో వ్యవసాయం చేస్తున్నారు. ఎక్కువ ప్రయాసతో కూడుకున్న పసుపు పంట సాగు విషయంలో మహిళలే కీలక పాత్ర పోషిస్తున్నారు. పోచమ్మతల్లిగా భావించే పసుపు పంట సాగు విషయంలో అత్యంత నిష్ఠగా వ్యవహరిస్తూ జిల్లాను పసుపు నేలగా మార్చారు. ఒక్కమాటలో చెప్పాలంటే నిజామాబాద్‌ను వ్యవసాయ జిల్లాగా పేరు తీసుకురావడంలో సింహభాగం పాత్ర మహిళలదే అనడంలో ఎలాంటి సందేహం లేదు.

భూమిని నమ్ముకొని.. వ్యవసాయం చేస్తూ..

బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని మెండోరా మండలం బుస్సాపూర్‌కు చెందిన మహిళా రైతు సువర్ణ పసుపు సాగుతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. బుస్సాపూర్ కోడలిగా వచ్చిన సువర్ణ భర్త వికలాంగుడు కావడంతో జీవితంలో ముందుకెళ్లేందుకు అనేక కష్టాలను ఎదుర్కొంది. భర్తతో వచ్చిన గొడవలతో సువర్ణ పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఐదెకరాల భూమిని నమ్ముకుని పట్టుదలతో వ్యవసాయం చేస్తూ వచ్చింది. పంటపొలం గ్రామానికి దూరంగా ఉండడంతో స్కూటీ నడపడం నేర్చుకుంది. ప్రతిరోజూ స్కూటీ మీద వెళ్లి వస్తూ సాగును పర్యవేక్షిస్తోంది. పోచమ్మ తల్లిగా భావించే పసుపు పంటను సాగు చేస్తూనే ఒక్కగానొక్క కూతురు అఖిలను బీటెక్ చదివించింది. రూ.30 లక్షలు ఖర్చు చేసి కుమార్తెను అమెరికా పంపింది.

భర్త సహకారం లేనప్పటికీ పట్టుదలతో వ్యవసాయం చేసి కుమార్తెను ఉన్నత చదువులు చదివించడంతో పలువురు అభినందిస్తున్నారు. తాను నిలదొక్కుకునేందుకు సీతమ్మ తల్లి మాదిరిగా కష్టాలు పడ్డానని కన్నీళ్లతో చెప్పిన సువర్ణ వ్యవసాయమే తమ కుటుంబాన్ని నిలబెట్టిందని చెప్పింది.



వ్యవసాయంతో ఆనందం..

ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని డొంకేశ్వర్‌కు చెందిన గోక సరోజ, డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లికి చెందిన గడ్డం లహరి అనే మహిళా రైతులు వ్యవసాయంపై ఇష్టం పెంచుకుని నిరంతరం పంటల సాగుతో ఆనందంగా ఉంటున్నారు. ప్రతి ఏడాది పసుపు, మక్క, జొన్న, సజ్జ పంటల సాగులో అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. విత్తనాలు వేయడంతో మొదలుకొని పంట చేతికి వచ్చేదాకా పొలాల్లోనే ఉంటూ వ్యవసాయం చేస్తున్నారు. పంట వేయాలన్నా, కోయాలన్నా వీరి చేతితోనే మొదలు పెట్టడం ఆ కుటుంబాల్లో ఆనవాయితీగా వస్తోంది. వ్యవసాయ పనుల్లో వీళ్లిద్దరిదే ప్రధాన పాత్ర. ముఖ్యంగా తరాల నుంచి తల్లిపంటగా భావిస్తున్న పసుపు సాగు విషయంలో క్రమం తప్పకుండా వ్యవహరిస్తూ సాంప్రదాయాన్ని నిలబెట్టుకుంటున్నారు. తమ పూర్తి సమయాన్ని వ్యవసాయానికే కేటాయిస్తూ వస్తున్నారు.

క్లుప్తంగా

10న సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి: కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ పాఠశాల (సీబీఎస్ఈ)లో ఆరో తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు సైనిక్ స్కూల్ సెట్- 2024 ఈ నెల 10 (ఆదివారం)న నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీవో అలివేలు, డీసీవో బి సంగీత, ప్రిన్సిపాల్ గోదావరి (సుద్దపల్లి) వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో సుద్దపల్లి బాలికల గురుకుల, కామారెడ్డి జిల్లాలో దోమకొండ గురుకుల బాలికల పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తారని వివరించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్: బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1 ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు గడువును ఈనెల 12 వరకు పొడిగించినట్లు స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ వెంకన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రాసే బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంబేడ్కర్ విద్యానిధి పథకానికి..

అంబేడ్కర్ విద్యానిధి పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శశికళ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే పేద ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ దేశాల్లో విశ్వవిద్యాలయాల్లో చదువుకునేవారికి స్కాలర్‌షిప్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 31 తేదీలోపు దరఖాస్తు ఫారాలను అందించాలన్నారు.

సైగ చేస్తే జైలుకే..

- మహిళలకు అండగా షీ టీం
- మీ కోసం.. మీ వెంటే నినాదంతో సేవలు
- సదస్సులతో యువతులు, మహిళల్లో చైతన్యం


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై స్రవంతి

రేపటికి ముందడుగు

గ్రామీణ ప్రాంతం నుంచి పైచదువుల కోసం కాలేజీకి ప్రతి రోజూ బస్సులో వస్తున్న విద్యార్థినిని ఓ యువకుడు ప్రేమ పేరుతో వేధించాడు. యువతి వచ్చే బస్సు వెనకాలే బైక్‌పై ప్రతిరోజూ యువకుడు ఫాలో అవుతుండడంతో ఆమె ఇబ్బందులు పడింది. తండ్రి బైక్‌పై వచ్చినా యువకుడు ఫాలో అవడంతో ఆమె తన స్నేహితులకు తన ఇబ్బందిని తెలిపింది. వారి సూచన మేరకు తల్లిదండ్రులతో కలిసి ఆమె షీటీం వద్దకు వెళ్లింది. మరుసటి రోజే షీటీం సభ్యులు సదరు యువకుడిని పట్టుకొని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. యువకుడికి షీటీం సభ్యులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఓ ఆర్కెస్ట్రా బృందంలో సభ్యురాలిగా ఉన్న మహిళ గురించి ఓ యువకుడు కొన్నిరోజుల క్రితం సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టులుపెట్టాడు. బాధితురాలు వెంటనే షీటీం సభ్యులను ఆశ్రయించింది. విచారణ చేపట్టిన షీటీం సభ్యులు.. మహిళకు ఆర్కెస్ట్రాలో మంచిపేరు రావడాన్ని జీర్ణించుకోలేక యువకుడు సోషల్ మీడియాలో అసభ్యపోస్టులు చేసినట్లు తేల్చారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే తమకు అనుకూలంగా ఉంటుందని, చెప్పినట్లు వింటుందనే ఆలోచనతో పోస్టులు పెట్టినట్లు తేలింది. దీంతో యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చిన షీటీం సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఖలీల్‌వాడి: మహిళలు, విద్యార్థినులు, యువతులపై వేధింపులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2014లో షీటీమ్‌ను ప్రారంభించింది. షీ టీం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 2016లో అందుబాటులోకి వచ్చింది. అప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, యాంటీహ్యూమన్ ట్రాఫికింగ్‌తోపాటు వివిధ అంశాలపై విద్యార్థినులు, యువతులు, మహిళలను చైతన్యం చేస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, వారంతపు సంతలు, సినిమా థియేటర్లు, జాతరలు, ప్రధాన కూడళ్లు (చౌరస్తాలు), స్కూళ్లు, కాలేజీలు, పార్కులు, ప్రార్థనామందిరాలు, హాస్టళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోలీసు కళాజాత బృందాలు కార్యక్రమాలు నిర్వహించి షీటీం అందించే సేవలను వివరిస్తున్నారు.

అందుబాటులో ఉంటుంది

మహిళలు, యువతులు, విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటాం. వేధింపులు ఎదుర్కొన్నవారు ధైర్యంగా షీటీం సభ్యులకు ఫిర్యాదు చేయొచ్చు. మహిళల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు. ఫిర్యాదు అందిన వెంటనే కౌన్సిలింగ్ నిర్వహిస్తాం. అయినా మార్పులేనిపక్షంలో చర్యలు తీసుకుంటాం. సీపీ ఆదేశాల అనుసారం మఫ్టీలు షీటీంలు తిరుగుతాయి.

– స్రవంతి, ఎస్సై షీటీం, నిజామాబాద్

24 గంటలపాటు సేవలు

ప్రతి మహిళను పురుషులు తమ కుటుంబ సభ్యురాలిగా భావించాలి. సీపీ ఆదేశాల మేరకు 24గంటలపాటు సేవలందిస్తున్నాం. యువతులు, విద్యార్థినులు, మహిళలపై దురుసుగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తాం. డయల్ 100, షీ టీం సభ్యులకు లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటాం.

– రేఖ, షీటీం సభ్యురాలు, నిజామాబాద్

వివక్ష రూపుమాపాలి

ఆడవారికేనా నిబంధనలు



ఇంట్లో కొడుకు, కూతురు ఉంటే.. కేవలం కూతురికి మాత్రమే నిబంధనలను అమలు చేస్తారు. కొడుకుకు మాత్రం ఎలాంటి నిబంధనలు ఉండవు. మేమూ మనుషులమే కదా.. మాకు స్వేచ్ఛ ఉండాలి కదా.. స్వేచ్ఛ ఉంటేనే ఏదైనా సాధించాలనే తపన మాకు ఉంటుంది.

– ఎం.శ్రీలేఖ

కఠిన చర్యలు ఉండాలి



మహిళలు, విద్యార్థినులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఘాతుకాలకు పాల్పడేవారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. కఠిన చట్టాలు రూపొందించినప్పుడే వేధింపులు, దాడులు ఆగుతాయి. ప్రభుత్వాలు ఆ దిశగా పనిచేస్తేనే ఎంతో మేలు జరుగుతుంది.

– రమ్య, ఈసీఈ, థర్డ్ ఇయర్

మగవారికి అవగాహన కల్పించాలి



మహిళలపై కొనసాగుతున్న వేధింపులు నిలిచిపోవాలంటే ముందుగా మగవారికి ప్రత్యేకంగా అవగాహన కల్పించాలి. ఆడవారికి స్వేచ్ఛ ఇవ్వాలని, మహిళలు, విద్యార్థినులను వేధించొద్దని సూచించాలి. తద్వారా సగం మందిలోనైనా మార్పు వస్తుంది. ఈ దిశగా ప్రభుత్వాలు స్పందించాలి.

– ఫాతిమా

క్రీడల్లో నారీమణులు

- ఇందూరు కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తున్న వనితలు

నిజామాబాద్ నాగారం: క్రీడల్లో రాణిస్తూ ఇందూరు కీర్తిని విశ్వవ్యాప్తం చేశారు ఈ అతివలు.. తాము ఎంచుకున్న క్రీడల్లో సత్తా చాటుతూ ఎందరో యువతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి సాధన చేసి అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా లోని మహిళా క్రీడాకారుల గురించి కథనం..

బరిలోకి దిగితే పతకమే..



బాక్సింగ్‌లో అమ్మాయిలు రాణించడం చాలా అరుదు. అలాంటిది అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు నిజామాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్. తన తండ్రితో పాత కలెక్టరేట్ మైదానంలో వాకింగ్ చేయడానికి వెళ్లిన సమయంలో బాక్సింగ్‌లో ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారులను చూసి నేర్చుకోవాలనుకుంది. ఈ విషయాన్ని తండ్రికి తెలపడంతో ఆయన కోచ్ శంషోద్దీన్ వద్ద బాక్సింగ్‌లో ఓనమాలు నేర్పించారు. బాలురతో కలిసి బాక్సింగ్ నేర్చుకున్న ఆమె ఇప్పుడు ప్రత్యర్థులను చిత్తు చేస్తూ జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తుంది. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ బంగారు పతకం, కామన్‌వెల్త్ క్రీడల్లో బంగారు పతకం సాధించిన ఆమె ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా శ్రమిస్తోంది.

హాకీ జట్టుకు కోచ్‌గా..



నగరంలోని ఎల్లమ్మగుట్ట కాలనీకి చెందిన యెండల సౌందర్య తల్లిదండ్రుల ప్రోత్సాహంతో హాకీలో రాణించింది. చిన్నవయస్సు నుంచే హాకీ శిక్షణలో శ్రమించింది. ఎన్నో సార్లు గాయాల బారిన పడ్డ అంతర్జాతీయ స్థాయిలో రాణించి తనకంటు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం భారత హాకీ హాకీ మహిళా జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తోంది. ఇటీవలే అంతర్జాతీయ మహిళల టోర్నమెంట్‌కు కోచ్‌గా వెళ్లింది. అక్కడ మన జట్టు విజేతగా నిలిచింది.

‘కొండ’ంత ఆత్మవిశ్వాసంతో..



సిరికొండ మండలం పాకాల అనే మారుమూల గ్రామంలో జన్మించిన మలావత్ పూర్ణ కొండంత ఆత్మవిశ్వాసంతో ఎన్నో శిఖరాలను అధిరోహించారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి గురుకుల పాఠశాలలో చదువుతున్న సమయంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చొరవతో ఎవరెస్ట్ శిఖరం ఎక్కిన పూర్ణ.. ఆ తర్వాత మరెన్నో శిఖరాలను అధిరోహించి యువతులకు ఆదర్శంగా నిలిచారు. పూర్ణ పేరు మీద సినిమా కూడా వచ్చింది.

భారత జట్టుకు ప్రాతినిధ్యం



రెంజల్ మండలం కిసాన్‌నగర్ తండాకు చెందిన గుగులోత్ సౌమ్య ఫుట్‌బాల్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రైవేట్ పీఈటీ నాగరాజు ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. గత ప్రభుత్వం సౌమ్యకు ఆర్థిక సహాయం ప్రకటించిన ఇవ్వలేదు. అయినా కుంగిపోకుండా ముందుకు వెళ్లుతుంది. జాతీయ జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకుంది.

వద్దనుకున్న కూతురే దిక్కైంది


తల్లితో కలిసి లావణ్య

మాక్లూర్: వద్దు అనుకున్న కూతురే నేడు ఇంటికి పెద్ద దిక్కు గా మారి కుటుంబాన్ని పోషిస్తుంది. కుటుంబ భారాన్ని ఎత్తుకోవడంతో పాటు తన ఏడుగురు అక్కల మంచి చెడులు చూస్తూ పలువురితో ప్రశంసలు అందుకుంటోంది. వల్లభాపూర్ గ్రామానికి చెందిన రాజన్న, నర్సుబాయిలది నిరుపేద కుటుంబం. వీరి దాంపత్య జీవితంలో మొదటి సంతానంగా ఆడ బిడ్డ జన్మించింది. ఆ తర్వాత మగబిడ్డ కోసం దంపతులు ఆరాటపడ్డారు. మళ్లీ ఆడబిడ్డ ఇలా మొత్తం 8 మంది ఆడబిడ్డలు జన్మించారు. ఇందులో చివరి బిడ్డే లావణ్య. పుట్టుకతోనే లావణ్య వికలాంగురాలు. దీంతో తల్లిదండ్రులు మరింత నిరాశ నిస్పృహకు లోనయ్యారు. వేసుకోవటానికి బట్టలు కూడ కుట్టించేవారు కాదు. చూడలేక ఇతరులు దానంగా ఇచ్చిన పాత బట్టలనే వేసుకునేది. రెండు కాళ్లు లేకపోయినా పాకుతూ స్వతహాగానే పాఠశాలకు వెళ్లింది. స్వగ్రామంలో 5వ తరగతి వరకు చదివింది. చదువుపై ఉన్న శ్రద్ధను చూసి చిక్లీ శివారులో ఉన్న బ్రిలియంట్ పాఠశాల యాజమాన్యం 10 వరకు ఉచితంగానే విద్యనందించింది. సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణురాలైన లావణ్య ఆ తరువాత ఇంటర్మీడియట్ నందిపేట మండలం ఐలాపూర్‌లో చదివింది. విద్యనభ్యసిస్తూనే బీడీలు చుట్టడం నేర్చుకుంది. తండ్రి ఆమె చిన్నతనంలోనే అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ భారమంతా అమ్మపైనే పడటంతో తట్టుకోలేక చదువు ఆపేసి నందిపేటలో ప్రయివేట్ ఉద్యోగం చేయటం ప్రారంభించి, కుటుంబానికి అండగా నిలుస్తోంది. తన ఏడుగురు అక్కల్లో ముగ్గురు అక్కల పెళ్లి ఈమె సంపాదనతోనే జరిపించింది. ప్రస్తుతం ఓ ప్రయివేట్ పరిశ్రమలో నెలకు రూ.10 వేలు సంపాదిస్తూ తల్లిని పోషించటమే కాదు కంటికి రెప్పలా కాపాడుకుంటోంది.

బీజేపీ, ఎస్బీఐ మధ్య చీకటి ఒప్పందం

- ఎలక్టోరల్‌బాండ్ వివరాలు బహిర్గతం చేయడం లేదు
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆరోపణ


ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖలీల్‌వాడి: ఎలక్టోరల్ బాండ్ పథకంతో బీజేపీ అనైతిక లావాదేవీలకు పాల్పడిందని, ఆ పార్టీతో చీకటి ఒప్పందం కారణంగానే ఎస్బీఐ లావాదేవీల వివరాలను బహిర్గతం చేయడం లేదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ వివరాలను బహిర్గతం చేయకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు తీసుకున్న ఎలక్టోరల్ బాండ్ (విరాళాలు) వివరాలను ఎలక్షన్ కమిషన్‌కు మార్చి 6వ తేదీ వరకు అప్పగించాలని సుప్రీం కోర్టు ఆదేశించినా ఎస్బీఐ స్పందించలేదని విమర్శించారు. కార్పొరేట్లకు తొత్తుగా వ్యవహరిస్తున్న బీజేపీ.. వారి నుంచి కోట్లాది రూపాయల నల్లధనాన్ని విరాళాల పేరుతో ఖాతాలో జమ చేసుకుందని ఆరోపించారు. ఎస్బీఐ వివరాలను బహిర్గతం చేస్తే బీజేపీ బండారం బయటపడుతుందన్నారు. ధర్నాలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, పీసీసీ మాజీ కార్యదర్శి రాంభూపాల్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విక్కీయాదవ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగం, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, పంచరెడ్డి చరణ్, ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఏడీఈ, ఏఈ గొడవపై విచారణ

- సీఎండీ ఆదేశాలతో రంగంలోకి విజిలెన్స్

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం/ఎడపల్లి:రియల్ ఎస్టేట్ వెంచర్‌కు ఎస్టిమేషన్ రూపొందించే విషయంలో ఎడపల్లి ఏడీఈ, ఏఈ గొడవపడిన వైనంపై ఈనెల 7న ‘సాక్షి’లో ‘ఏఈపై ఏడీఈ దాడి’ శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి విచారణ చేపట్టాలని ఆదేశించారు. విజిలెన్స్ డీఈ ప్రభాకర్ గురువారం ఎడపల్లి సెక్షన్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. గొడవ జరిగిన సమయంలో ప్రత్యక్షంగా ఉన్న వారితో మాట్లాడారు. విచారణ నివేదికను సీఎండీకి అందజేయనున్నట్లు డీఈ తెలిపారు.

రాతపూర్వకంగా ఫిర్యాదు

ఎడపల్లి ఏఈ నాగేంద్రప్రసాద్ ఏడీఈపై రాతపూర్వకంగా బోధన్ డీఈ ఎండీ ముక్తార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారనేది చర్చనీయాంశమైంది.

మల్లారం అడవిలో మంటలు


మంటలను ఆర్పుతున్న ఫారెస్ట్, అగ్నిమాపక సిబ్బంది

వర్ని: మండలంలోని మల్లారం, తగిలేపల్లి అటవీ ప్రాంతంలో గురువారం మంటలు చెలరేగాయి. గుర్తుతెలియని వ్యక్తులు బీడీ లేదా సిగరెట్ కాల్చి అటవీప్రాంతంలో పారవేయడంతో మంటలు అంటుకున్నాయని వర్ని డిప్యూటీ రేంజ్ అధికారి బాబు పేర్కొన్నారు. బీడీలు, సిగరెట్లు కాల్చి అటవీప్రాంతంలో పారవేయొద్దని ఆయన సూచించారు. ప్రజలు అటవీశాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం



ఖలీల్‌వాడి: నగరంలోని రెండో పోలీస్ స్టేషన్ పరిధిలోని శంభుని గుడి సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇటీవలే సౌదీ అరేబియా నుంచి వచ్చిన షేక్ జావీద్ బంధువుల ఫంక్షన్ ఉండడంతో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. కొద్ది సేపటికి ఇంట్లో నుంచి పొగలు రావడంతో చుట్టుపక్కల వారు జావీద్‌కు సమాచారం అందించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. మంటలు వ్యాపించడంతో ఇంట్లోని వస్తువులు కాలిపోవడంతోపాటు సిలిండర్ పేలింది. సమాచారం అందినవెంటనే ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేసినట్లు ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు తెలిపారు. అగ్ని ప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

క్రైం కార్నర్

స్వగ్రామానికి చేరిన మృతదేహం


రాజేశ్(ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): మండలంలోని ధర్మోరాకు చెందిన మోర్తాడ్ రాజేశ్ ప్రమాదవశాత్తు ఖతార్‌లో మృతి చెందగా, గురువారం స్వగ్రామానికి అతడి మృతదేహం చేరింది. కొన్నేళ్లుగా ఖతార్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న రాజేశ్ వారం రోజుల క్రితం బాత్‌రూంలో ప్రమాదవశాత్తు కాలుజారిపడ్డాడు. రాజేశ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్నేహితులు అతడిని ఆస్పత్రిలో చేర్పించగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఖతార్‌లోని తెలంగాణ గల్ఫ్ సమితి అవసరమైన పత్రాలు సమర్పించి రాజేశ్ మృతదేహాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్‌ఎయిర్‌పోర్టుకు పంపించగా, ఉచిత అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతుడి కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్షుడు మైదం మధు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌లో వాహనాలు

వర్ని/నవీపేట/ఎడపల్లి/ఇందల్వాయి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పట్టుకున్నారు. వర్ని మండలం జాకోరా రోడ్డులో 249.70 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని వర్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నిఖిల్ రాజ్ తెలిపారు. నవీపేట మండలం సుభాష్‌నగర్‌లో ఎనిమిది క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న సయ్యద్ సావేజ్, ఫెరోజ్‌ను అరెస్టు చేశామన్నారు. రెండు వాహనాల్లో తరలిస్తున్న 55 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎడపల్లిలో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. బియ్యం తరలింపులో ఎడపల్లి మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి(బీఆర్ఎస్ నాయకుడు), నిజామాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడి హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లిలో 32 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మహేశ్‌కుమార్, వినోద్ తెలిపారు.

రైలు కిందపడి ఆత్మహత్య

ఇందల్వాయి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరానికి చెందిన దేవేండ్ల శ్రీను(42) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఇందల్వాయి ఎస్సై మనోజ్ తెలిపారు. తాపీమేస్త్రిగా పనిచేసేందుకు శ్రీను గత నెలలో వచ్చాడన్నారు. అనారోగ్య సమస్యల కారణంగా మనస్తాపానికి గురైన శ్రీను రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాన్ని రైల్వే పోలీసులకు అప్పగించి మృతుడి బంధువులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

మద్యానికి బానిసై ..

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని నాగ్‌పూర్ గేట్ సమీపంలో ఉన్న చెరువులో దూకి షేక్ షాదుల్లా(45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యూ మహేశ్ తెలిపారు. డ్రైవర్‌గా పని చేసే షాదుల్లా మద్యానికి బానిసై గురువారం సాయంత్రం నడిపల్లితండా పరిధిలోని దమ్మన్నకుంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి కొడుకు అర్షద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

నవీపేట : మహారాష్ట్ర నుంచి కారులో అక్రమంగా తీసుకువస్తున్న మద్యం బాటిళ్లను మండలంలోని నాగేపూర్ సమీపంలో ఎక్సైజ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు మద్యం తరలిస్తున్న మనోజ్, పవన్‌ను అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాడిలో ఎస్సై మల్లేశ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నవీపేట : మండలంలోని ఫకీరాబాద్ శివారులో పేకాట ఆడుతున్న వారిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. రూ.3వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

మొరం టిప్పర్ పట్టివేత



బాల్కొండ: అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను బాల్కొండ పోలీసులు బుధవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. మొరం, ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్సై శంకర్ హెచ్చరించారు. టిప్పర్‌ను మైనింగ్ శాఖకు అప్పగించినట్లు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు..

వర్ని: మండలంలోని పాతవర్ని శివారు నుంచి అనుమతులు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. గురువారం తెల్లవారుజామున గుండ్లవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. ట్రాక్టర్‌ను తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమానికి రూ.2వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ మోతీసింగ్ తెలిపారు.

పోతంగల్‌లో..

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని మంజీర నదిలోనుంచి ఇసుక తరలిస్తు న్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడిచేసి ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంబంధిత అధికారులకు సమాచారం అందించామన్నారు.

బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడి రిమాండ్

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రేమ పేరుతో మైనర్ బాలికను గర్భవతిని చేసి మోసం చేసిన కొడబోయిన అశోక్‌ను గురువారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను మోసం చేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన అశోక్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

మరొకరిపై పోక్సో..?

కామారెడ్డి క్రైం: మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో ఒకరిపై పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణంలోని ఓ క్రీడా ప్రాంగణంలో పట్టణానికి చెందిన 12 ఏళ్ల బాలిక బ్యాడ్మింటన్ ప్రాక్టీస్‌కు వచ్చేది. అక్కడ కోచ్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించగా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిసింది. బాలిక మైనర్ కావడంతో పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు.